క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న గంగుల కమలాకర్

కరీంనగర్‌కల్చరల్: సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు శనివారం మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తన క్యాంపు కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు. 31 మందికి సుమారు రూ.21,73,500 విలువ గల చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, కొత్తపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ రుద్ర రాజు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న సీపీ

కరీంనగర్‌స్పోర్ట్స్: ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కరాటే పోటీ పరీక్షల్లో పాల్గొని ప్రతిభ బ్లాక్‌బెల్ట్‌లు సాధించిన చైత్రిణి, మేధారెడ్డి, జయశ్రీ, సిద్ధార్థ్, సాకేత్‌లను శనివారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలం అభినందించారు. ఆత్మస్థైర్యానికి, ఆత్మవిశ్వాసానికి మార్షల్ ఆర్ట్స్ కరాటే క్రీడ దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చీఫ్ వసంత్‌కుమార్, ఇన్‌స్ట్రక్టర్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను నిలదీయాలి

కరీంనగర్ కార్పొరేషన్: పదేళ్లు అధికారంలో ఉండి ప్రజలకు బీఆర్ఎస్ చేసిందేమిటో ఎల్కతుర్తి సభలో నిలదీయాలని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులు గౌడ్ అన్నారు. శనివారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కేవలం దోచుకో దాచుకో అనే పద్ధతిలో బీఆర్ఎస్ పాలన సాగిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు మరిచి కేవలం కుటుంబం కోసమే పనిచేసిందన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా నిర్మాణాత్మక పాత్ర పోషించాల్సిన కేసీఆర్ కనీసం అసెంబ్లీ వైపు కూడా రావడం లేదని అన్నారు.

'రాహుల్‌ను విమర్శించే నైతికత కవితకు లేదు'

కరీంనగర్ కార్పొరేషన్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని విమర్శించే నైతికత బీఆర్ఎస్ నాయకురాలు కవితకు లేదని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అజీమ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లిక్కర్ స్కాంలో అడ్డంగా దొరికి జైలుకు వెళ్లొచ్చిన తర్వాత కవిత అడ్డగోలుగా మాట్లాడుతుందని విమర్శించారు. జాగృతి పేరుతో వందల కోట్ల రూపాయలు వసూలు చేసిన చరిత్ర కవితదన్నారు.

పోలీసుల కవాతు

చొప్పదండి: మండల కేంద్రంలో శనివారం పోలీసులు కవాతు నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా, మార్కెట్ చౌరస్తా మీదుగా పుర వీధుల గుండా పోలీస్ స్టేషన్ వరకు వందమంది ప్రత్యేక పోలీసులు పాల్గొన్నారు. శాంతిభద్రతలకు నిత్యం అండగా ఉంటామని, ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని చొప్పదండి సీఐ ప్రకాశ్ గౌడ్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు మామిడాల సురేందర్, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రటి ఎండ.. ఇదేం ఉదారత







అసలే ఎండాకాలం.. ఆపై చెమటలు కక్కేలా ఉష్ణోగ్రతలు వెరసి మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం గుదిబండగా మారింది. 'తాంబూలమిచ్చా'.. ఏదో అన్నట్లు రూ.5కే భోజనం పెడుతున్నాం తినేవారికి ఎలా ఉంటే మాకేం అన్నట్లుగా వ్యవహరించడం ఆందోళనకర పరిణామం. మున్సిపల్ కార్యాలయం వద్ద గల కళాభారతి ఎదుట పేదలకు రూ.5కే భోజనం పెడుతున్న విషయం తెలిసిందే. అయితే నిప్పులు కక్కుతున్న వేసవిలో తినడం ఎంత కష్టం.. ఓ వైపు చెమట మరోవైపు పాదాలకు మంట సదరు స్థితిలో ఎవరైనా భోజనం చేయగలరా..? కలెక్టర్ గారూ ఓ సారిటు చూదరూ.!

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్



కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని కాపువాడ పాత బైపాస్ రోడ్డు అంధకారంగా మారింది. 30, 6 డివిజన్‌ల పరిధిలోని ఈ రోడ్డులో వీధి దీపాల నిర్వహణ సక్రమంగా లేక డివిజన్‌ల వాసులు, ఈ రోడ్డు గుండా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని ప్రధాన రోడ్లలో ఒకటైన ఈ పాత బైపాస్ రోడ్డులో వీధి దీపాలు వెలగక రోజులు గడుస్తున్న నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చర్యలు చేపట్టాలి. – తోట అనిల్, మారుతినగర్, కరీంనగర్

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
అబ్దుల్ గఫూర్, ఏఈ,70131 48449

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 94400 77555

మహారుద్ర, శ్రీసూక్త, గేయరామాయణ మహోత్సవం



అనుగ్రహ భాషణం చేస్తున్న మాధవానంద సరస్వతీస్వామి. పారాయణాల్లో పాల్గొన్న ఋత్వికులు

కరీంనగర్ కల్చరల్: అఖిల బ్రాహ్మణ సేవా సంఘం కరీంనగర్ శాఖ సౌజన్యంతో గాయత్రీనగర్ గణేశ శారదా శంకరాలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మహారుద్ర, శ్రీసూక్త, గేయరామాయణ మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. పుణ్యాహవాచనం అనంతరం రుద్ర, శ్రీమాత్రే నమః, శ్రీసూక్త పారాయణాలు జరిగాయి. రంగంపేట గురు మధవానంద సరస్వతీ పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి ప్రత్యక్ష పర్యవేక్షకులుగా హాజరై మాట్లాడుతూ ధర్మసూత్రాలు, ప్రవచనాలు వింటే లాభం లేదని వాటిని ఆచరణలో పెట్టాలని అన్నారు. అప్పుడే ధర్మసంస్థాపన సాధ్యమని సూచించారు. తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను గౌరవించాలన్నారు. ప్రతీ మనిషితో ప్రేమ పూర్వకంగా మెదలాలని తెలిపారు. బండపల్లి ఉపేంద్రశర్మ, రామక విఠలశర్మ, నేదునూరి వామనరావు, జీవీ రంగారా వేంకట్రామారావు, గంగవరం వేంకటేశ్వరశర్మ, మూగు నాగన్న, బొమ్మకంటి రాధాకిషన్‌రావు, యోగా సంపత్ కుమార్, ఆయాచితుల రాజేశ్వరరావు, భూశంకరశర్మ, ఎర్రబాటి శశికాంత్, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

కామర్స్ విద్యార్థులకు అత్యున్నత విద్యా కోర్సులు


నృత్యం చేస్తున్న విద్యార్థులు

కరీంనగర్‌సిటీ: కామర్స్ విద్యార్థులకు డిగ్రీ తర్వాత అత్యున్నతమైన ఉన్నత విద్యా కోర్సులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఎస్సారార్ కాలేజీ ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. శనివారం ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విద్యార్థులకు 'సయోనార' పేరుతో నిర్వహించిన వీడ్కోలు సంబరాల్లో మాట్లాడారు. ఒక ప్రణాళిక, శ్రమ, పట్టుదల, కృషితో తమ జీవితంలో ఉన్నతస్థాయిలో స్థిరపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడారు సురేందర్‌రెడ్డి, కామర్స్ విభాగాధిపతి రాజయ్య, వైస్ ప్రిన్సిపాల్ నితిన్, అటానమి సమన్వయకర్త వంగల శ్రీనివాస్, స్టాఫ్ క్లబ్ సెక్రెటరీ ఎం.శ్రీనివాసరెడ్డి, ఐక్యూఏసీ సమన్వయకర్త హర్‌జ్యోత్‌కౌర్, కార్యక్రమ సమన్వయకర్త ఎం.మల్లారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

బొటానికల్ టూర్లతో విద్యార్థులకు విజ్ఞానం

ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాలలో చదువుతున్న వృక్షశాస్త్ర విద్యార్థులు శనివారం మహారాష్ట్రలో బల్లార్షా ప్రాంతంలోని అటల్ బీహారీ వాజ్‌పేయ్ జాతీయ వృక్షశాస్త్ర బొటానికల్ గార్డెన్‌ను సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. బొటానికల్ టూర్‌లతో విద్యార్థులకు వృక్షశాస్త్రంపై విజ్ఞానం పెంచడమే కాకుండా ప్రత్యక్ష అనుభవాలను పెంచుతుందన్నారు.

నైపుణ్యాలు పెంచడానికే వాణిజ్య సదస్సులు


మాట్లాడుతున్న ఎస్‌వీ ఓఎస్‌డీ హరికాంత్

కరీంనగర్‌సిటీ: విద్యార్థుల నైపుణ్యాలు పెంచడానికే వాణిజ్య సదస్సులు ఉపయోగపడుతాయని శాతవాహన యూనివర్సిటీ ఓఎస్‌డీ హరికాంత్ అన్నారు. కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో 'కాంఫియస్టా–2025' పేరిట శనివారం నిర్వహించిన వాణిజ్య సదస్సులో మాట్లాడారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ఎదగాలంటే ఇలాంటి కార్యక్రమాల ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నాయకత్వ లక్షణాలు, వివిధ సృజనాత్మక భావనలను పెంచుకునేందుకు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీవో సంపత్‌కుమార్, ఏవోబీ శ్రావణ్ కుమార్, కామర్స్ విభాగాధిపతి ఆర్.గోపికృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పన్నుల వసూలు ముమ్మరం

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని వర్తక, వాణిజ్య వ్యాపార, ఇంటి యజమానులు పన్నులు చెల్లిస్తే ఐదుశాతం రిబెట్ పొందే సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ అన్నారు. శనివారం పట్టణంలో పన్నుల వసూలు కార్యక్రమం ముమ్మరం చేశారు. జమ్మికుంట ఏప్రిల్ నెల పన్నుల వసూలులో మొదటి స్థానంలో ఉందని, చివరి నాలుగు రోజుల్లో పన్నులు చెల్లించి సహకరించాలని కోరారు. సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, పాషా సిబ్బంది పాల్గొన్నారు.

యూనిఫామ్స్ తయారీ

- బట్ట పంపిణీతో కుడుతున్న మహిళలు
- మొదటిదశలో నిక్కర్లు, ప్యాంట్లు తయారీ
- పాఠశాలల పునఃప్రారంభానికి అందించేలా చర్యలు


మండల సమాఖ్య ఆధ్వర్యంలో బట్టను కటింగ్ చేస్తున్న మహిళలు

కరీంనగర్‌రూరల్: రాబోయే విద్యాసంవత్సరం పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు యూనిఫామ్స్ అందించేలా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. పాఠశాలలు తెరిచిన తొలి రోజే యూనిఫామ్స్ పంపిణీ చేయాలనే లక్ష్యంతో ఇటీవల కరీంనగర్ ఎమ్మార్సీకి వచ్చిన నిక్కరు, ప్యాంటు బట్టలను స్వశక్తి సంఘాల మహిళలకు అందించారు. దీంతో మహిళలు యూనిఫామ్స్ కుట్టే పనిలో నిమగ్నమయ్యారు.

ఒక్కో విద్యార్థికి రెండు జతలు

కరీంనగర్ మండలంలో 29 ప్రభుత్వపాఠశాలల పరిధిలో మొత్తం 1,635 మంది విద్యార్థులున్నారు. వీరిలో బాలురు 867, బాలికలు 768 మంది ఉన్నారు. ప్రభుత్వం ఏటా ఒక్కో విద్యార్థికి రెండు జతల యూనిఫామ్స్‌ను అందిస్తోంది. ప్రభుత్వం యూనిఫామ్స్ తయారీ బాధ్యతను స్వశక్తి సంఘాలకు అప్పగించడంతో మహిళలకు ఉపాధి లభిస్తోంది. ప్రస్తుతం ఎలబోతారం కుట్టు కేంద్రంలో 19మంది, మొగ్దుంపూర్‌లో 22 మంది, చామనపల్లిలో 20 మంది చొప్పున మొత్తం 61 మంది మహిళలు యూనిఫామ్స్ కుడుతున్నారు. ఆరుగురు మాస్టర్‌ట్రైనర్లు విద్యార్థుల కొలతల ప్రకారం బట్టను కటింగ్ చేసి ఆయా కేంద్రాల్లోని మహిళలకు పంపిస్తున్నారు. గతేడాది పంపిణీ చేసిన యూనిఫామ్స్ కొలతల్లో తేడాలతో విద్యార్థులకు సరిపోలేదు. పలువురు విద్యార్థులు యూనిఫామ్స్ సరిపోక సాధారణ దుస్తులతోనే పాఠశాలలకు హాజరయ్యారు. దీంతో అప్రమత్తమైన అధికారులు గత నెలలో మహిళలతో విద్యార్థులందరి కొలతలు సేకరించారు.


ఎలబోతారంలో ప్యాంటు కుడుతున్న మహిళలు

మొదటి దశలో నిక్కర్లు, ప్యాంట్లు తయారీ

ప్రభుత్వం మొదటి దశలో బాలురకు నిక్కర్లు, ప్యాంట్ల తయారీకి వినియోగించే బట్టను సరఫరా చేసింది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు నిక్కర్, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్యాంటు కుడుతున్నారు. బాలికలకు 1వ తరగతి నుంచి 2వ తరగతి వరకు బాడీఫ్రాక్, 3వ తరగతి నుంచి 5వ రకు స్కర్టు, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పైజామాను మహిళలు తయారీ చేస్తున్నారు.

మొదటి దశలో ఒక యూనిఫామ్

మొదటి దశలో పాఠశాలల పునఃప్రారంభానికి విద్యార్థులకు ఒక యూనిఫామ్ అందించేలా చర్యలు చేపట్టాం. రెండో జత ఆగస్టు 15 నాటికి అందజేస్తాం. ప్రస్తుతం నిక్కర్లు, ప్యాంట్ల బట్ట రావడంతో మహిళలు కుడుతున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో షర్ట్ బట్ట సరఫరా చేసే అవకాశముంది.

– భార్గవ్, ఏపీఎం, ఐకేపీ కరీంనగర్‌రూరల్

వక్ఫ్ సవరణ చట్టంతో పేద ముస్లింలకు మేలు

కరీంనగర్‌టౌన్: పేద, మధ్య తరగతి ముస్లింల కోసమే కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం వక్ఫ్ చట్టం సవరణలు చేపట్టిందని బీజేపీ సీనియర్ నాయకులు కోమల ఆంజనేయులు అన్నారు. శనివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ చట్టం 2005 జన జాగరణ అభియాన్ కార్యశాల నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ల కొరకు మైనారిటీలను వాడుకుందని, మోదీ ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అట్టడుగున ఉన్న పేద, మధ్యతరగతి ముస్లిం ప్రజలకు అందించాలని వక్ఫ్ చట్టంలోని లోపాలను సవరించిందే తప్ప ముస్లింలకు వ్యతిరేకం కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరహరి లక్ష్మారెడ్డి, బాలు శ్రీనివాస్, ఉప్పరపల్లి శ్రీనివాస్, మామిడి రమేశ్, గోదరి నరేశ్, తిరుమల్ రెడ్డి, కొంగల రాజిరెడ్డి, బొంగోని పరశురాం, శీతల రమేశ్ చంద్ర, అబ్బిడి మాధవ రెడ్డి, పబ్బల్ల ఆంజనేయులు, పీచర విష్ణువర్ధన్‌రావు, మజీద్, రుక్సానా, అక్తర్, ముంతాజ్, యూసుబ్ బీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కశ్మీర్‌లో మృతి చెందిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

అనాథ వృద్ధుడికి అంత్యక్రియలు


శ్యాంసుందర్‌కు అంత్యక్రియలు నిర్వహిస్తున్న వీరమాధవ్

కరీంనగర్‌టౌన్: శ్రీవీరబ్రహ్మేంద్ర అనాథ వృద్ధుల ఆశ్రమం (వీబీ ఫౌండేషన్) నిర్వహణలో నడుస్తున్న నిరాశ్రయుల కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న పులికోట శ్యాంసుందర్ అనారోగ్యం పాలయ్యాడు. ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో చికిత్స కోసం చేర్పించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్యకు సమాచారం అందించినప్పటికీ ఆమె స్పందించలేదని ఆశ్రమ నిర్వాహకుడు సీపెల్లి వీరమాధవ్ తెలిపారు. దీంతో శ్యాంసుందర్ మృతదేహానికి ఆశ్రమ నిర్వాహకుడు వీరమాధవ్ మున్సిపల్ సిబ్బంది సాయంతో మానేరు వాగు ఒడ్డున అంత్యక్రియలు నిర్వహించారు.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా శివపార్వతుల కల్యాణం

కరీంనగర్‌లోని రామేశ్వరాలయంలో ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకొని శనివారం శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం నవ చండీయాగం జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఉడుతల వెంకన్న, ఆలయ కమిటీ బాధ్యులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు. – కరీంనగర్‌కల్చరల్


నవ చండీయాగం నిర్వహిస్తున్న అర్చకులు

ఉచిత స్విమ్మింగ్ క్యాంప్ పరిశీలన


స్విమ్మింగ్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న నరేందర్ రెడ్డి

కొత్తపల్లి: వీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈటెక్నో స్కూల్ ఆవరణలోని స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహిస్తున్న ఉచిత స్విమ్మింగ్ క్యాంపును శనివారం ఆ ఫౌండేషన్, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి పరిశీలించారు. విద్యతో పాటు విద్యార్థులకు క్రీడలపై అవగాహన కల్పించి వారిలో నైపుణ్యం పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలతో పాటు విద్యార్థుల శ్రేయస్సే లక్ష్యంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, తల్లిదండ్రులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి మృతులకు నివాళి


నివాళి అర్పిస్తున్న కరీంనగర్ వాసులు


హౌసింగ్‌బోర్డ్ కాలనీలో..


బీసీ సంఘం ఆధ్వర్యంలో..


సరస్వతీనగర్‌లో..

కరీంనగర్‌టౌన్/కరీంనగర్‌కల్చరల్/కరీంనగర్ కార్పొరేషన్: కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకులకు శనివారం కరీంనగర్‌లో వివిధ సంఘాల ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. రిటైర్డ్ డీఈ శీలం శంకర్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఇంతటి ఘోరానికి పాల్పడిన వారిని మట్టు పెట్టి దేశ ప్రజల్లో ఉన్న భయాందోళలు పోగొట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో శరద్, దీపక్, అవనీంద్ర, స్థానికులు పాల్గొన్నారు. బీసీ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని మహాత్మాజ్యోతిబాపూలే మైదానంలో ఆర్డీవో మహేశ్వర్, బీసీ సంఘం నాయకులు నివాళి అర్పించారు. సరస్వతీనగర్‌లో జ్ఞాన అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సరస్వతీనగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మార్క్‌ఫెడ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాంనగర్‌లో ర్యాలీ నిర్వహించి ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేశారు. హౌసింగ్‌బోర్డుకాలనీలో కాలనీవాసులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. గ్రంథాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ సుభాష్‌చంద్రబోస్ విగ్రహం వరకు సాగింది. అనంతరం సుభాష్‌చంద్రబోస్ విగ్రహం వద్ద మృతులకు నివాళి అర్పిస్తూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాలనీవాసులు తోట సాగర్, కోట శ్రీనివాస్, నల్ల గణపతిరెడ్డి, ఉప్పుమల్ల సంజీవ్, నర్సింహారెడ్డి, రంగనాయకుల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ముష్కరులను కఠినంగా శిక్షించాలి

కరీంనగర్‌కల్చరల్: కశ్మీర్‌లో దాడికి పాల్పడిన ముష్కరులను కఠినంగా శిక్షించాలని భవానీ సాహిత్య వేదిక జిల్లా అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ అన్నారు. శనివారం వావిలాలపల్లిలోని గులాబీల మల్లారెడ్డి బిల్డింగ్ ఆవరణలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది గులాబీల మల్లారెడ్డి, తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం ప్రధాన కార్యదర్శి బొమ్మకంటి కిషన్, తెలుగు రక్షణ వేదిక అధ్యక్షుడు అన్నాడి గజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంప ఉమాపతి, పద్యకవి బొద్దుల లక్ష్మయ్య, తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి పెద్దిరాజు సత్యనారాయణ రాజు, వెల్ముల జయపాల్ రెడ్డి, మియాపురం శ్రీనివాస్, గజవాడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న కొప్పుల శంకర్

ఇల్లందకుంట: నిబంధనలను ఉల్లఘించి పంచాయతీ కార్మికుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ డిమాండ్ చేశారు. శనివారం మాట్లాడుతూ.. మండలంలోని శ్రీరాములపల్లి గ్రామపంచాయతీలో 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికుని పేరు ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా తాత్కాలికంగా నియమించుకున్న కార్మికుడి పేరు నమోదు చేయడం అనుమానాలు రేకెత్తిస్తుందని, ఈ విషయంపై వెంటనే విచారణ జరిపి కార్మికుడికి న్యాయం చేయాలని ఎంపీడీవోకు ఫిర్యాదు చేశామన్నారు. స్పందించకుంటే కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు కొత్తూరి మల్లయ్య, కార్మికుడు పర్లపెల్లి మల్లేశ్ పాల్గొన్నారు.